


# అచ్చొచ్చిన మంచం

కోటమర్తి చిన రఘుపతిరావు

—o—

అచ్చొచ్చిన మంచం అంటూంటే "అదేమిటోయి! అట్లా అంటావు. చాల్లే! నీ మాటలు నీవును, ఏ మాటలు వచ్చినా సోద్యంగానే చెపుతావు, సోద్యమా యని. నల్లుల్లేని మంచాలు వుంటాయా యేమిటి? మా పుట్టింటి వారు ముష్పైయేళ్ల క్రింద నాకీమంచం సారి పెట్టారు. అప్పటనుంచీ దీన్ని పువ్వుల్లో పెట్టి జాగ్రత్తగా వాడుకొంటున్నాము. ఇన్నాళ్లకి కనకక్కనక ఒక పిల్లను కని దానికి సారిగా మా పుట్టింటి వాళ్ళిచ్చిన మంచం అని మూడుమాట్లు విరిగిపోయినా జాగ్రత్తగా బాగుచేయించి యిచ్చినందులకు రోజూ మమ్మల్నే సాధించుకొని తినుచున్నావే? మా అమ్మ నాకీమంచం సారి యిస్తూ "అమ్మాయీ! ఈ మంచం అచ్చొచ్చిన మంచం సుమా! ఇది మా మేనమామ మామగారి తోడల్లుడు స్వంతంగా చేయించినాడు. ఇందుమీద నేను పధానుగుపురుళ్లు పోసుకొన్నాను. కన్నవాళ్లంతా చల్లగా వున్నారు. నీవు కడగొట్టు పిల్లవని నీకీమంచం సారి యిచ్చాను. నీవుకూడా దీన్ని వుపయోగించి నీకు కూతురు పుడితే యీ మంచమే సారిగా పెట్టమ్మా!" అని చెప్పి దీన్ని రెండెడ్లబండి గూడుమీద వేయించి కట్టించి బండివాడితో మంచం జాగ్రత్త అని మరీ మరీ చెప్పి, యింట్లోకి వెళ్ళి, పాలి కాపు చేత మేము వూరి పొలిమేర దగ్గరికి వెళ్లేటప్పటికి మంచం బండి గూడుమీదనుంచి దింపడం మఱచిపోతారేమో జాగ్రత్తని వర్తమానం చేయించింది. అప్పటినుంచీ దీన్ని కంట్లో బెట్టుకొని వాడుకొనినాము. అంత అచ్చొచ్చిన మంచం అని నాకూతురికి సారి పెట్టి మీయింటికి పంపిస్తే దీనికి నల్లులున్నాయని తోసివేస్తావా! పోనీ! నల్లులే వున్నా యనుకో వయ్యా! అవేమి తేళ్లా! పాములా! బాధ పెడతాయేమో అనడానికి. నిద్రపట్టని వాళ్లకి మంచం నిండా దోషులు వున్నాయనడం మామూలైపోయింది. నా పిల్లలకుగాని నాకుగాని మా అమ్మకుగాని మా ముసలమ్మకుగాని కుట్టని నల్లులు నీ కోసం మూటలు ముల్లెలు కట్టుకొని కాపురం వుండడానికి వచ్చాయా యేమిటి యీ మంచంలోకి. ఇది యెంత మంచి మంచమో నీకేమి తెలియును. ఊరికే మంచి మంచం కాదనడం మాత్రం చేతనౌను.

మా యింటిప్రక్క కాపురం వున్నారే సూరమ్మగారు ఆవిడి కో అమ్మాయి వుంది. ఆ అమ్మాయికి పదమూడో యేట వివాహమైంది. ఆరముగ్గిన పండుగదా, త్వరలో కాపరానికి రాకపోతుందా అని వేయిరూపాయి లిచ్చి అత్తగారికి, ఆ పిల్లని పెళ్ళి చేసుకొన్నా డొక ముసలాయిన! కాని ఆ పిల్ల అనుకొన్నట్టుగా మరుచటి నెలలోనే కాపరానికి వెళ్లలేదు. మాచకమ్మను కొనుక్కొన్నానని మండేడ్చాడు. మాయింట ఫదోయేట సమర్తాడడం ఆనుమాయితీ; ఇంకా యీ పీనుగకు అల్లాటిది యేమీ లేదు. అని తల్లి నిత్యము తిట్టి పోస్తుండేది. నన్నేం చేయమన్నారు పిన్నిగారు అని ఆ అమ్మాయి రోజూ మన యింటికి వచ్చి విచారించేది పాపం—ఆ మొగుడు రండు మూడేళ్లు చూచి తిరిగి వివాహం చేసుకోవాలని ప్రయత్నం చేస్తూన్నట్టు నాకు కొంచెం చూచాయగా తెలిసింది. ఈ ముక్క సూరమ్మగారితో చెప్పి 'కానీ చూద్దాం! పిన్నీ! మాకు అచ్చొచ్చిన మంచం వుంది. అందు మీద పక్కవేసి యివాళ రాత్రి మీ అమ్మాయిని పడుకోబెట్టును' అని మంచం యిచ్చాను. మరునాడు మాకు డోలు సన్నాయి మేళంతో మెళకువ వచ్చింది. ఆ సాయంకాలమే వాళ్ళింట్లో అట్లపంక్తికి వెళ్లాం. వాళ్ల పదహారేళ్ల పిల్లా సమర్తాడి వూరుకుంది. అప్పుడు సూరమ్మ పిన్ని వచ్చి ఆ మంచాన్ని పొగిడిన పొగడ్తం యింతా అంతా కాదు. సూరమ్మ పిన్ని అల్లుడు వచ్చి నాకు చీర

రవికెల గుడ్డ యిచ్చి మరీ గర్భాధానపు పీట లెక్కాడు.

చూచావా! అంత మంచి మంచాన్ని నీవు నిరాకరించడం యేమీ బాగాలేదు. దానెత్తు బంగారం యిచ్చినా గాని అల్లాంటి మంచం దొరకదు.

ఎల్లమ్మగారి రెండో అమ్మాయి కాపురానికి వెళ్ళి యిరవైయేళ్లైంది. ఆ అమ్మాయి కడుపున ఒక్క కాయ కసరుకూడా కలగలేదు. పాపం మొగుడు పెళ్లాంకూడా సంతానంకోసం మంచం పట్టారు. అశ్వద్ధ ప్రదక్షిణాలు, సప్తసాగర యాత్రలు, సత్యనారాయణ వ్రతాలు, ఒక లక్ష చేశారు. ఏమీ ప్రయోజనం లేకపోయింది. సోడల క్రిందా, సాముద్రికోల క్రిందా, జ్యోతిషాలక్రింద, తాయెత్తులక్రింద యింతా అంతా డబ్బు ఖర్చుగాదు. ఒక నాడు వోలిచీర గట్టించి వారి గదిలో అచ్చొచ్చిన మంచం అని యీ మంచమే వేశాం. తొమ్మిదినెల్లు నిండకుండానే దుంపలాంటి కుఱ్ఱాడు పుట్టాడు. ఆ అబ్బాయి పుట్టిన మర్నాడే వేయినూటపదహార్లు కట్నం యిచ్చి పిల్లనిస్తామని ఒకరు నిశ్చయం చేసుకొని వెళ్ళినారు.

అల్లాగే నీకడుపునకూడా ఓకాయో కసరో ఏదైనా పుడితే చూచి ఆనందించుతామని మొహం అంతా కళ్లు చేసుకొని చూస్తూ వుంటే ఏమీలేదుసరే కదా! మంచాన్ని నల్లులున్నాయో యని తెల్లవార్లు ఒక్కటే సాదింపా! లేని నల్లులు నీవు రమ్మంటే వస్తాయా! ఉన్న నల్లులు పొమ్మంటే పోతాయా! అల్లాంటి దానికోసం పదిసార్లు అనుకోవడం ఏమి ప్రయోజనము. నల్లులే వున్నాయనుకో. వుంటే యేమి? హానియా? అపకీర్తియా? వాటి మానాన్ని అవి వుంటాయి. నీ మట్టుకు నీ వుంటావు. నీకు వానికి సంబంధమేమిటి! జేగంటలాగ దీపం చేత్తో పుచ్చుకొని బల్లాలు బాకుల్లాగ చీపురుపుల్లలు చేత్తో పుచ్చుకొని నల్లుల్ని వేటాడ్డానికి బయలేర్దావు, అర్ధరాత్రివేళ. పిల్లల్లేని తల్లి నల్లుల్లేని మంచం యింట్లో వుండగూడదని మా తాత చెబుతూ వుండేవాడు. నల్లులుండడం సహజంగానే వుంది గాని నీవనడం సహజంగా లేదు. నల్లులు మంచాల కుంటాయిగాని ప్రాకులు కుంటాయా యేమిటి! ఇంకోటి కూడాను. మనం నల్లులకోసం మంచం వుంచుకొన్నామా యేమిటి, మంచం వుంచుకొన్నాము కాబట్టి నల్లు లొచ్చాయిగాని. ఇంతకీ మనకి మంచం ప్రధానమా? నల్లులు ప్రధానమా? అందులో అచ్చొచ్చిన మంచం—మా మంచం సంగతీ సందర్భం నీకేమి తెలుసును మీ మామగారి సంబంధం రాకముందు ఒకరు మాయింటికి నన్నడగ వచ్చారు. లక్షాధికార్లట. ఎన్నో యెకరాల పొలం వుందంట. మా సాంప్రదాయం చాలా మంచిదని విన్నారట—అంచేత నన్నడగొచ్చారు. ఆ నాటికే మానాన్న యింట్లో డబ్బంతా ఖర్చు పెట్టేశాడు. ఎల్లాగరా భగవంతుడా అని అనుకొంటూంటే యింతట్లో పెళ్లివారు రావడం తటసించింది. మానాన్న దగ్గర బియ్యం కొనడానికైనా డబ్బు లేక మా అమ్మని రహస్యంగా పిలచి "ఇంతమంది బంధువులు వచ్చారు. డబ్బు లేదు బియ్యం కొనడానికి—ఏం చేయమన్నావు" అని అడిగాడు. మా అమ్మ మనస్సు కరిగిపోయి మీరు వెలుపలకు వెళ్లండి. నేను లెక్క తెచ్చి యిస్తానని చెప్పి గదిలోపల గోళ్ళెము పెట్టుకొని కొంతసేపటికి రెండు వరహాలు తెచ్చి యిచ్చింది. ఈ కిటుకు కనిపెట్టాలని మా నాన్న తలుపు సందుల్లోంచి చూచాడు. భోజనం అయినాక మంచం నులక బాగు చెయ్యాలని పట్టు పట్టుకొని మా అమ్మ దగ్గరనుంచి తలుపు తాళాలు లాక్కొని యీ మంచం బయట పడేసి నులక విప్పడం ప్రారంభించాడు. అప్పుడు మా అమ్మ చూచి సహించలేక నూతిలో పడింది. మానాన్న నులక విప్పడం మానేసి తక్షణం నూతిలోకి దిగి యింకెప్పుడు నులక మంచం ముట్టుకోనని ప్రమాణంచేసి ఆమెను బయటకు తీశాడు. అప్పటినుంచి మా అమ్మ యీ మంచం నులక సందుల్లో డబ్బు దాచుకోవడం మానేసింది. కాని యెవరు ఆ మంచంకూడా ముట్టుకోవడం మానేసినారు. మానాన్న బ్రతికి వున్నంత కాలం తన మాట నిలబెట్టుకొన్నాడని మా అమ్మ యెంతో సంతోషించేది. ఒక భోజనం చేయడానికి వెళ్లేటప్పుడు తప్ప యింకెప్పుడూ మా అమ్మ యీ మంచం మీదనుంచి లేవనే లేదు. రోజల్లా అందుమీదే కాలక్షేపం చేసేది.

మా పినతండ్రి కోమారు జ్వరం వచ్చింది. అంతో బ్రతకడన్నారు. ఇరుగుపొరుగు అమ్మలక్కలు మూతులు ముక్కలు విరిచారు. అమావాస్య దాటాలని ధనిష్ఠా పంచకాలు దాటాలని రోజులు లెక్కపెట్టడం ప్రారంభించారు. వైద్యుడుకూడా గడ్డు ఖాయిలా అన్నాడు. కాని ప్రాణభయం రాదన్నాడు. ఇంతట్లో మా పురో

హితుడు వచ్చి రోగి మంచం మార్చవలసిందన్నాడు. పోనీ యని మాయమ్మ దయతలచి యీ మంచం వేసింది. ఈ మంచం మార్చిన్నాడే మా పినతండ్రి పథ్యం పుచ్చుకొన్నాడు. మళ్లీ నాటికీ నేటికీ ఆయన జబ్బున చీదలేదు. దాంతోటి యీ మంచం అంటే మా యింటిల్లిపాదికి విశ్వాసం కుదిరింది. కల్పతరువనీ, కామధేనువనీ, చింతామణి యని యేమేమో యని మా అమ్మ యీ మంచాన్ని పొగుడుతూ వుండేది.

కొన్నాళ్లకి మా అమ్మకి జబ్బు చేసిందని మా పాలికాపు యెవళ్లో చెప్పుకొంటూంటే విన్నాడట. వచ్చి నాతో చెప్పాడు. దాంతోటి నాకు నవనాళ్ళూ తెగిపోయాయి. పెద్దకాలం వచ్చిన మనిషి బ్రతుకుతుందా అనుకొన్నాను. ఇంతట్లో యీ మంచం సంగతి జ్ఞాపకం వచ్చి మా పాలికాపుచేత యీ మంచం పంపి మరునాడు నేను వెళ్లాను. మాయమ్మ యీ మంచం చూచి జబ్బు తగ్గినట్టుగానే భావించి సంతోషించింది. రెండు నెలలు ఆవిడ జబ్బుతో తీసుకొంది. ఎప్పుడూ వున్న జబ్బేయని నేను పొరుగింటికి వెళ్లి వచ్చేటప్పటికి మా యింట్లో వాళ్లంతా గొల్లుమన్నారు. అదేమిటో యని లోపలికి వెళ్ళి చూచేటప్పటికి మాయమ్మ తాటాకుల చాపమీద చచ్చిపోయి వుంది.



"అచ్చొచ్చిన మంచంమీదనుంచి దింపెయ్యడంచేత చచ్చిపోయింది. లేకపోతే బ్రతుకునేమో. ఆ మంచంమీద వున్నంతకాలం హరిబ్రహ్మలైనా చచ్చిపోరు" అని మా యింటిప్రక్క వున్న తిరువేంగళాచార్లగారి పెళ్ళాం అంది. ఆవిడ చనిపోయిన పన్నెండో నాడే నా మంచం నేను తెచ్చుకొన్నాను. అప్పటినుంచీ దీన్ని మరీ జాగ్రత్తగా వాడుతున్నాను. అల్లాంటి మంచం. ఆ మంచానికి నల్లులున్నాయనడం యేమీ బాగాలేదు. మా వీధి వెనకాల యింట్లో వున్న బి.యే. కుఱ్ఱాళ్లు పరీక్షల్లో చదువుకోడానికి యీ మంచం పని గట్టుకొని అడిగి పట్టుకొని వెడతారు. ఎందుకు పట్టుకొని వెడుతాన్నారా యని సందేహం వచ్చింది. దీనిమీద పడుకొని చదివితే పరీక్ష ప్యాసు అవుతుందా యని అడిగాను. ఈ మంచంమీద పడుకొని చదివితే తెల్లవార్లు నిద్రపోకుండా చదువుకో వచ్చునని వాళ్ళు చెప్పారు. అందుచేతనే వాళ్ళు తెల్లవార్లూ చదువుకొని పరీక్షలు ప్యాసు అవుతున్నారు. చూశావా! ఇది యెంత మంచి మంచమో! నీకేమి తెలియును.

మా ముసలమ్మ ఒకమాటు పొన్నాడ తీర్థాన్ని కెడితే ఒక్కమాటుగా అయిదు దెయ్యాలు పట్టుకొన్నాయి. ఈవిడ గావు కేకలకి తీర్థప్రజ యావన్మంది వికావికలై పారిపోయినారు. మరి రెండు రోజులకి కొంతమంది కవులు ఆవిడని చేతులు కాళ్ళు కట్టేసి యింటికి తీసుకొని వచ్చారు. పిచ్చి యని కొందరు, హిస్టీరియా అని కొందరు. దెయ్యాలే యని కొందరు తలకోమాటగా చెప్పారు. అప్పుడో గొప్ప శాస్త్రివేత్తని రప్పించి మంత్రజపం చేయిస్తూవుండగా ఒక రోజున ఆయనకి యీ మంచంమీద ప్రక్క వేయవలసివచ్చి వేశాం. ఆనాటి రాత్రే ఆయనకి ముక్కోటి దేవతలు ప్రత్యక్షమై "మహానుభావా! అయిదు దెయ్యాలిని వదల్చడానికి మీబోంట్లింత ఘోర తపస్సు చేయాలా! మీరు పండుకొన్న మంచంమీద ఆవిడకి అయిదు రాత్రిళ్ళు ప్రక్కవేసి కదలకుండా ఆవిడని కట్టెయ్యండి. ఆవిడకి ఆ బాధ వదలకపోతే మేం ముక్కోటి దేవతలం మీ పాదాక్రాంతుల మవు" తామని ప్రమాణంచేసి చెప్పారట. ఆ శాస్త్రివేత్త తన స్వప్నగత వృత్తాంతం అంతా చెప్పి అల్లాగే అయిదు రోజులు చేయించాడు. అంతే, మళ్ళీ దెయ్యంలేదు గియ్యంలేదు. ఈ మంచం చూపించామంటే "బాబోయి దెయ్యం పట్టలేదండోయి" అని కేకవేసి జాగ్రత్తగా వుండేది. ఆ మంచం దెయ్యాలకి బీజాక్షరం అయిపోయింది.

అల్లాంటి మంచి మంచాన్ని నీవు త్రోసి పారవేయడం యేమీ బాగాలేదు. మా యమ్మ వున్నంత కాలం నిత్యం తులశమ్మకోటకి ప్రదక్షిణం మానేసి యీమంచానికే చేసేది. మేమంతా అల్లా పూజచేసే మంచాన్ని

నీవు నిరాకరించడం యేమీ బాగాలేదు. పడితే దేవతార్చన పెట్టెలో పెట్టుకోవలసిన మంచానిని నిందిస్తే మాకు చాలా కష్టంగా వుంటుంది. అది యెంత మంచి మంచమో నీ వూరికే నల్లు లున్నాయంటావుగాని. ఆ మాటకొస్తే ఆ మంచాన్ని వున్న నల్లుల విత్తనంగూడా చాలా మంచిదని మీ తాతగారే స్వయంగా దాఖలాచూచి చెప్పారు. అదేమిటో తెలిసిందా!

మీ తాతగారికి ఓ మాటు గడ్డంమీద పేనుకొరకడం ప్రారంభించింది. అది చూచి వూళ్లో వాళ్లు 'పేడిమూతి తాత'యని ఆక్షేపించడం ప్రారంభించించారట. మా యమ్మమ్మ మంగలాడికి డబ్బు ఖర్చు తగ్గిందని సంతోషించింది. కాని మంగలాడికి మట్టుకు తనకు వచ్చే నెలకు రెండణాల సొమ్ము పోగొట్టుకోవడం యెందుకని మా తాతని బిలచి ఆ పేను కొరికినచోట నల్లి రక్తం రాయమని సలహా యిచ్చాడు. అది విని మా తాత "అమ్మాయీ! నాకో నల్లి కావాలని అడిగేటప్పటికి యీ మంచం నల్లే తీసి ఒకటి యిచ్చింది. మా తాత ఆ మంగలి వైద్యం చేశాడు. అంతే. మరుచటి వారంలో మా తాత గడ్డం చేయడానికి ఆ మంగలే పావలా డబ్బులు పుచ్చుకొన్నాడు. అది చూచి మా తాత మంచం నల్లుల్ని స్వయంగా పొగిడి "నల్లి కోరూపాయి యిచ్చినా యెవర్నీ వీనిని చంపనీయకు. ఈనల్లుల విత్తనం యెక్కడిదోగాని మహా మంచిదిలాగ కనబడుతోంది. ఆ మంచంమీద పడుకొన్నా అవి బాధ పెట్టుచున్నట్టు కనబట్టంలేదు. అందుచేత యిది తెల్లవాళ్ల దేశంలోంచి దిగుమతి అయినాయేమో? నొప్పి పెట్టకుండా నెత్తురు పీల్చేశక్తి వుంది వీటికూడా! వీనిని జాగర్త పెడుతూండండి" అని చెప్పాడు.

అల్లాంటి పెద్దలందరిచేత వొప్పుపొందిన యీ మంచం నీకు యిన్నాళ్లకి నులక్కుక్కి అయిందా! మా నాన్నో, తాతో, వుంటే యీపాటికి కీమంచానికి ఓ దేవాలయం కట్టించి అందులో యీ మంచమేశ్వరుడుని ప్రతిష్ఠాపన చేసి వుందురే. అల్లాంటి మంచాన్ని వెధవ మంచం అని తిడతావా? చాలు చాలు!!

నీవు మంచాన్ని తిట్టడంకంటె నిద్రపోవడం నేర్చుకొంటే బాగుంటుంది. నిద్ర పట్టకపోవడం నీ కళ్లల్లో వుందిగాని యీ మంచం గళ్లల్లోలేదు. నిద్ర పట్టకపోవడం తిట్టేవాళ్ల నోళ్లల్లో వుందిగాని యీ మంచం కోళ్లల్లోలేదు. కాబట్టి కళ్లు మూసుకొని పడుకో! ఇవాళ కాకపోతే రేపైనా నిద్రపడుతుంది. రాత్రి పట్టకపోతే పగలు పడుకో! ఈమంచంమీద వున్న మమకారం కొద్దీ చెప్పానుగాని లేకపోతే నేను మాట్లాడేదాన్నికాను. నీకిష్టమైతేనే విను; లేకపోతే హాయిగా పడుకో పీడకలలు రాకుండా వుంటాయి. నేనేమీ అతి సంభాషణ చేసేదాన్నిగాను తెలిసిందా!

---




జనజీవి
పైత్యాన్ని, అజీర్ణాన్ని నివారించును.
సీసా 2 అణాలు.     పెద్ద సీసా 12 అణాలు.

అమృతామలకతైలము
మందు వేసగిలో అత్యంతోపకారి.
2½ అణాలు.     6 ఔన్సులు 12 అణాలు.

యూటినాల్
ఎటువంటి గర్భిణి స్త్రీలకైనా యిది మంచి టానిక్.
సోల్ ఏజంట్లు:     నంజంగూడ్ సద్వైద్యశాల
యునైటెడ్ కన్సనిన్, 54, బందరు వీధి, మద్రాసు.